క్లుప్తంగా

హామీలను విస్మరించిన సీఎం

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఇచ్చిన హామీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారని, ఉచిత బస్సు పథకం వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సోడెం ప్రసాద్, చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు, ముళ్లగిరి గంగరాజు, తగరం నిర్మల, మడకం గోవిందు, కారం సూరిబాబు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

అశ్వాపురం: మండలంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మండలానికి చెందిన జర్నలిస్టులు మణుగూరులో ఎమ్మెల్యే నివాసంలో శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వెలమ రాజేందర్, పర్శబోయిన రాధాకృష్ణ, గోపినాథ్, వెంకట్రావు, లెనిన్‌కుమార్, నగేష్, అంజన్‌రావు, అర్జున్, నాగరాజు, కోటేశ్వరరావు, మల్లారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వయంగా పరిశీలించారు. శనివారం అశ్వారావుపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, పలు సమస్యలపై సంబంధిత దరఖాస్తులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించిన ఎమ్మెల్యే, వారితో నేరుగా మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని ఫోన్‌లైన్‌లో అధికారులకు సూచించారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ

ములకలపల్లి: ఏడేళ్ల చిన్నారి కుష్మిత తండ్రికి తలకొరివి పెట్టి, చూపరులను కన్నీరు పెట్టించింది. ములకలపల్లి మండలం జగన్నాథపురం జీపీలోని నల్లివారిగూడెం గ్రామానికి చెందిన గోకవరపు అయ్యప్పస్వామి గుండెపోటుతో శుక్రవారం ఆకస్మికంగా మృత్యువాత పడ్డాడు. అయ్యప్పకు ఇద్దరు కూతుర్లు పూజిత, కుష్మిత జన్మించగా, చిన్నకూతురు శనివారం అంత్యక్రియలు నిర్వహించింది. తండ్రి అయ్యప్ప చితికి నిప్పంటించింది. అంతిమ సంస్కారాలు చేసింది. అయప్ప లయన్స్ క్లబ్‌కు నేత్రాలు దానం ఇవ్వగా, కొత్తగూడెంకు అగర్వాల్స్ ఐ హాస్పటల్‌కు చెందిన విష్ణు, ప్రవీణ్ నేత్రాలను సేకరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

బూర్గంపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఎంబీ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. బూర్గంపాడులో శనివారం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవం పోసిన మహనీయుడి పట్ల అమిత్ షా చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలంతా ఐక్యంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండవుల రామనాథం, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

చర్ల: గ్రేస్ మిషన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం 60 మంది పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పూజారిగూడెంలోని డేకేర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చేతుల మీదుగా గ్రామంలోని 60 మంది మహిళలకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకలను నూతన వస్త్రాలతో పేద మహిళలు జరుపుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు జాకబ్ అభినందనీయులన్నారు. గ్రేస్ మిషన్ సర్వీస్ సొసైటీ చర్ల ఏరియా ప్రతినిధి పి.సులోమోన్, స్థానిక ఇన్‌చార్జ్ పూజారి లక్ష్మీనారాయణ, దొడ్డా ప్రభుదాసు, యేసుదాసు, డేవిడ్‌పాల్, గాబ్రియేల్, రూతు, రిబ్కా పాల్గొన్నారు.

చేరువైన వెచ్చని నేస్తాలు..

- జోరుగా ఉన్ని రగ్గులు, దుస్తుల అమ్మకాలు
- చలి తీవ్రత పెరగడంతో గిరాకీ
- ఏజెన్సీలో మరింతగా చలి



చిన్నారుల కోసం ప్రత్యేక డిజైన్లతో దుస్తులు



మహిళల కోసం స్వెట్టర్లు..



ఉన్ని దుస్తుల దుకాణం వద్ద ప్రజల సందడి..

సండే స్పెషల్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో మన్యంలో ఆదివాసీ గిరిజన ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఈ నేపథ్యంలో చలి నుంచి రక్షణ కోసం ఉన్ని దుస్తులను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

పలు డిజైన్లలో..

పట్టణంలోని బ్రిడ్జి రోడ్డు బస్టాండ్ సమీపంలో రాజస్తాన్ నుంచి వచ్చిన వ్యాపారులు ఫుట్‌పాత్‌పై తాత్కలిక దుకాణాలను ఏర్పాటు చేసుకుని ఉన్ని దుస్తువులను విక్రయిస్తున్నారు. వీరి వద్ద పలు రకాల డిజైన్లతో పెద్దలు, చిన్నారులతో పాటు మహిళ కోసం స్వెట్టర్లు, జర్కిన్లు, జాకెట్లు, మంకీ క్యాప్స్, రగ్గులు, శాలువాలు, స్కార్ఫ్‌లు, గ్లౌజులు అమ్ముతున్నారు. పట్టణంలో ఉన్న దుకాణాలతో పోల్చితే ఇక్కడ ధరలలో భారీగా వ్యత్యాసం ఉండడంతో పాటు చలి నుంచి రక్షణ ఇచ్చే దుస్తువులు ఆకర్షణీయంగా ఉండడంతో ప్రజలు వీరి వద్ద కొనేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

చలిలో ఎటువంటి రక్షణ లేకుండా బయటకు వెళ్లొదని, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు సూచిస్తుండడంతో ఉన్ని దుస్తువులను కొనుగోలు రోజురోజుకు పెరుగుతున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో ధరలు

పట్టణంలో ఏర్పాటు చేసి దుకాణాలలో ఉన్ని దుస్తువుల ధరలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. నాణ్యతను బట్టి ధరలలో వ్యత్యాసం ఉంది. రూ.50 నుంచి రూ.3 వేల వరకు దుస్తులు లభిస్తున్నాయి. పిల్లల స్వెట్టర్లు రూ.200 నుంచి 600 వరకు, పెద్దల స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.2 వేలు, శాలువాలు రూ.100 నుంచి రూ.500, స్కార్ఫ్‌లు రూ.50 నుంచి రూ.150, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి 200, గ్లౌజులు రూ.100 నుంచి 150, రగ్గులు రూ.600 నుంచి రూ.3 వేల వరకు ధరలకు అమ్ముతున్నారు. చలి పెరుగుతుండడంతో వ్యాపారం జోరుగా సాగుతోందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారం బాగుంది



చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రజలు ఉన్ని దుస్తువులు కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. దీంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. చిన్న పిల్లలకు కావాల్సిన అన్ని రకాల ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నాం. ధరలు ప్రజలకు అందుబాటులో ఉండడంతో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

– కమల్, వ్యాపారి, రాజస్థాన్

అందుబాటులో వివిధ మోడళ్లు



కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా ఉన్ని దుస్తులు అందుబాటులో ఉన్నాయి. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు అనేక రకాల డిజైన్స్ మావద్ద లభిస్తున్నాయి. ప్రజలను ఆకట్టుకునే విధంగా డిజైన్లు ఉండడంతో ప్రస్తుతం వ్యాపారం బాగానే సాగుతోంది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

– ధీరజ్, వ్యాపారి, రాజస్థాన్

నూతన క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, నాయకులు

మణుగూరురూరల్: పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం -2025 క్యాలెండర్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాల వారికి సమ ప్రాధాన్యత కల్పిస్తూ.. వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తోందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందించనుందన్నారు. పద్మశాలిలో ఎవరైనా పేదలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు డాక్టర్ దుస్సా సమ్మయ్య, ఉపాధ్యక్షుడు మహేశ్వరపు రమేష్, ప్రధాన కార్యదర్శి కోట శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కొలిపాక ప్రభాకర్, కోశాధికారి మేరుగు రవీంద్రనాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్ర నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి నర్సింహరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు సామా శ్రీనివాస్‌రెడ్డి, కూచిపూడిబాబు, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతర పోస్టర్లు ఆవిష్కరణ



జాతర వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, కమిటీ బాధ్యులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారి 23 వ జాతర మహోత్సవ పోస్టర్‌ను తహసీల్దార్ అశోక్‌కుమార్ చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతరకు సంబంధించి జరుగుతున్న పనులను తహసీల్దార్ పరిశీలించారు. మాట్లాడుతూ.. అమ్మవారి 9 రోజుల జాతరలో ఎటువంటి, అవాంచనీయ సంఘటనలు జరగకుండా తగిన ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ స్టీరింగ్ కమిటీ సభ్యులు కెల్లా వేణు గోపాల్, మొసలి రాంబాబు, పాలక వర్గం గౌర్స అశోక్ కుమార్, తాళ్లపూడి నాగేశ్వరరావు, గణేష్, కరుకు మల్లూరు, కాంగ్రెస్ పార్టీ మీడియా–కమ్యూనికేషన్స్ జిల్లా కన్వీనర్ దేవా, ప్రేమ్, హుస్సేన్ అహ్మద్, పవన్ రెడ్డి, దుర్గారావు, శివ, త్రినాథ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



చిన్నారులతో ట్రైనీ ఎస్సై ఉమ

ములకలపల్లి: ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని ట్రైనీ ఎస్సై ఉమ సూచించారు. గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ఆధ్వర్యంలో శనివారం సైబర్ క్రైమ్స్, చిన్నారుల అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల వినియోగంపై శనివారం ఏర్పాటు చేసిన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుండే ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, సాధనకు కృషి చేయాలని అన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు.

రాళ్లాపురంలో వైద్య శిబిరం



రాళ్లాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీధర్

చర్ల: మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంలో ఉన్న రాళ్లాపురంలో శనివారం చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్దాయికారి డాక్టర్ శ్రీధర ఆదివాసీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 30 మందిని గుర్తించి వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామాలంలో ఇంటింటి సర్వేను నిర్వహించి గ్రామస్తుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దోమ తెరలను వాడాలని, ఇంటి ఆవరణలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. శిబిరంలో డాక్టర్లు హారిక, డాక్టర్ పూజ, హెచ్‌ఈఓ వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్ రాంప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపీ ఆశా కార్యకర్త భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం వైద్యశాల ఆధ్వర్యంలో..

మండలంలోని సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పెద మిడిసిలేరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 145 మంది విద్యార్థినులకు పరీక్షించి 45 మందికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో వైద్యాధికారిని డాక్టర్ దివ్యనయన, హెచ్‌ఈఓ బాబూరావు, ఎంపీహెచ్ఎస్ తిరుపతమ్మ, ఎంఎల్‌హెచ్ ఎస్.తిరుపతమ్మ, మౌనిక, హెచ్ఎస్‌ఐ సుబ్బారావు, వేణు, ఆశా కార్యకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో సీఆర్టీల నిరసన

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఎదుట బతుకమ్మలను ఎత్తుకుని మహిళా సీఆర్టీ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఐటీడీఏ కోసం ఉమ్మడి జిల్లా సీఆర్టీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారంతో 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఐటీడీఏ ఆవరణాలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. ప్రభుత్వం స్పందించి తమ ఎనిమిది డిమాండ్లను పరిష్కారించకుంటే నూతన సంవత్సరంలో ఆమరణ దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఆర్టీల సంఘం నాయకులు శ్రీనివాస్, సక్రం, రవికుమార్, వీరన్న, రాజేష్, రూపా, నిర్మల, జ్యోతి, సుజాత, సునీత, బుచ్చయ్య, లక్ష్మణ్, నరసింహారావు, నాగేశ్వరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పేరాయిగూడెం గ్రామానికి చెందిన నార్లపాటి మాధవరావు, ఇదే గ్రామంలో ఓ పొలం వద్ద ఉన్న తాటి చెట్లను యంత్రంతో కోసే క్రమంలో అదుపుతప్పి ఎడమ కాలుపై యంత్రం పడింది. దీంతో మాధవరావు కాలుకు తీవ్ర గాయాలు కాగా, చిట్టితల్లి అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికు తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలించారు.

తెరుచుకోని విద్యావనరుల కేంద్రం



తాళం వేసి ఉన్న మండల విద్యావనరుల కేంద్రం

అశ్వాపురం: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం గేట్లు తెరుచుకోవడం లేదు. సమగ్ర శిక్షణ ఉద్యోగులు 22 రోజులుగా సమ్మె చేస్తున్నారు. విద్యావనరుల కేంద్రంలోని ఎనిమిది మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్నారు. దీంతో మండలంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల, విద్యార్థులకు సంబంధించిన సేవలు నిలిచిపోయాయి. ప్రతి రోజు మండలంలోని 24 గ్రామ పంచాయతీలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఉద్యోగులు సేవలు అందిస్తారు. ఉద్యోగుల సమ్మెతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకు విధుల్లో చేరేది లేదని ఉద్యోగులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేద్దాం

మణుగూరురూరల్: క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని మణుగూరు మండల వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల నిక్షయ్ షివిర్ ముమ్మర కృషి కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అశోక్‌నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత అనుమానితులను గుర్తించి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివకుమార్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధిపై చర్చించుకుని దానిపై అవగాహన పెంచుకోవాలన్నారు. క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 15రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడడం, మెడ చుట్టూ, సంకలో గడ్డలు వంటి ప్రధాన లక్షణాలు ఉన్నట్లయితే వారు వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఒకవేళ క్షయ వ్యాధి ఉన్నట్లయితే తగు మందులు, సూచనలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. పోషకాహార నిమిత్తం బాధితునికి మందులు వాడే కాలనికి ప్రతీ నెలా రూ.వెయ్యి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. టీబీ అనుమానితుల నుంచి కూడా ఎనిమిది తెమడ నమూనాలను తీసుకుని ట్రూనాట్‌కి పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ జానకి, ఎంఎల్‌హెచ్‌పీ వినయ్, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లు సమయ పాలన పాటించాలని మనుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్ డీటీ శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం రేషన్‌డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. జీసీపీ షాపుల నిర్వహణపై ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే సరిదిద్దుకోవాలని సూచించారు. లబ్ధిదారులు బియ్యం తీసుకోని ఖెడల వాటిని రికార్డులలో నమోదు చేయాలన్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద నాయకులు, రైతులు

దుమ్ముగూడెం: మారాయిగూడెం గ్రామంలోని జీసీసీ కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్యలు డిమాండ్ చేశారు. శనివారం మారాయిగూడెం జీసీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రాల్లో గత నెల రోజులుగా కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులు అనేక ఇబ్బందులు గురవుతున్నారని అన్నారు. జీసీసీ అధికారులు ధాన్యంపై కప్పుకోవడానికి రంగు బరకాలు సరఫరా చేయాలని, తేమశాతం మిషన్లలో లోపాలను సరిచేసి మరిన్ని మిషన్‌లు కేంద్రానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సోంది అర్జున్, రైతులు రేసు ధర్మయ్య, సోడి వెంకటేశ్వర్లు, అపక భద్రయ్య, బాలరాజు, నరేష్, సొంది రాజు, తోడం ప్రసాద్ తోడం జోగారావు, గంగరాజు, సోయం రాంబాబు, కారం ముద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి అభినందన

భద్రాచలంటౌన్: ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 20 వరకు జరిగిన పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కప్ పోటీలలో జిల్లా నుంచి పాల్గొన్న అంతర్జాతీయ గిరిజన క్రీడాకారుడు మోడెం వంశీ బంగారు పతకంతో పాటు స్ట్రాంగ్‌మెన్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి, జనరల్ సెక్రెటరి రామిరెడ్డి, శివరామకృష్ణ, గురు తేజ, భూపతిరెడ్డి తదితరులు వంశీని శనివారం అభినందించారు.

రెండో రోజు జీపీ కార్మికుల సమ్మె



అశ్వారావుపేటరూరల్: సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు



బూర్గంపాడు: కార్మికుల సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న ఎంబీ నర్సారెడ్డి

భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికులను ఇబ్బందులకు గురిచేసి పస్తులుంచిన ఏ ప్రభుత్వం కొనసాగిన చరిత్ర లేదని సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి అన్నారు. కనీస వేతనం ఉద్యోగ భద్రత కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మె శిబిరం వద్ద పలు విధాలుగా నిరసనలు చేపట్టారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రమాద బీమా పథకాన్ని 10 లక్షలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు నాగరాజు, రత్నం, మనోజ్ రెడ్డి, వీరన్న, విజయ, భాను, అనసూయ, సుశీల, ప్రసాద్ రెడ్డి, భద్రమ్మ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎంబీ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు బూర్గంపాడులో చేపట్టిన టోకెన్ సమ్మె శిబిరాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పంచాయతీ కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు పాండవుల రామనాథం, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, వెంకన్న, పుల్లయ్య, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఎన్నికల హామీలను నేరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు విజయవంతమైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు విడుదల చేసి, కనీస వేతనాన్ని రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లలో కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్, కేసుపాక నరసింహారావు, వేల్పుల ముత్తారావు, మల్లయ్య, విజయ్, సీతారాములు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చేపట్టిన రెండురోజుల రాష్ట్ర వ్యాప్త గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె మండలంలో విజయవంతం అయింది. శనివారం 2వ రోజు ఎంపీవో రామకృష్ణకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు భవాని, ప్రసాద్, రామకృష్ణ, వెంకటేష్, జానకి, సునీత, వీరస్వామి, జంపన్న, నరసింహారావు పాల్గొన్నారు.

ములకలపల్లి: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఎస్‌కె.జబ్బార్ డిమాండ్ చేశారు. జీపీ వర్కర్లు చేపట్టిన టోకెన్ సమ్మె శిబిరాన్ని రెండో రోజైన శనివారం సీపీఐ, టీడీపీ నాయకులు నరాటి రమేష్, చల్లా వెంకటేశ్వర్లు సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఎంపీడీఓ జి.రేవతికి వినతిపత్రం అందజేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గంటా శ్రీను, వర్కా రుక్మాంగధర రావు, గద్దల మహేశ్, వాంకుడోతు వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.